ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
సోమవారం 29 జనవరి 2024



నేతన్నలను కాపాడుకుంటా..

- సిరిసిల్లను వదిలి వెళ్లను
- పోయింది అధికారం మాత్రమే.. పోరాట పటిమ కాదు
- బండి సంజయ్‌కు ఓట్లు అడిగే హక్కులేదు
- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారకరామారావు
- సిరిసిల్ల నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సమావేశం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

నేతన్నలను కాపాడుకుంటామని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని నేతన్నల పక్షాన పోరాటం చేస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు అన్నారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయ భవన ప్రాంగణంలో బీఆర్ఎస్ సిరిసిల్ల నియోజకవర్గ స్థాయి సమావేశం అదివారం జరిగింది. రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ కేటీఆర్‌కు ఓటు వేశారని నేతన్నలకు ఆర్డర్లు ఎందుకు ఇవ్వాలని బెదిరిస్తున్నారని అన్నారు. సిరిసిల్ల ప్రజల ప్రతినిధిగా, 39 మంది



మాట్లాడుతున్న కేటీఆర్

ఎమ్మెల్యేలతో అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వాన్ని దిగ్బంధం చేస్తామని, నేతన్నలను కాపాడుకుంటామని అన్నారు. కొత్తగా ప్రభుత్వంలోకి వచ్చినంత మాత్రాన రాజులు, జాగీర్దార్లు, సుల్తాన్‌లుగా అనుకుంటే నడవదని అన్నారు. సిరిసిల్ల నుంచి కేటీఆర్ పోతున్నాడని, పుకార్లు పుడుతున్నాయని ఎక్కడికి పోవడం లేదని స్పష్టం చేశారు. రాజకీయ జన్మనిచ్చిన సిరిసిల్లను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఎవరూ ఎన్ని రాసినా పట్టించుకోవద్దని అన్నారు.

● స్థానిక ఎన్నికల్లో మీ కోసం కష్టపడుతాం...

శాసనసభ ఎన్నికల్లో నా కోసం ఎంతో కష్టపడ్డారని ఈ సంవత్సరం అంతా ఎన్నికలేనని పార్లమెంట్ ఎన్నికలతో పాటు సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్, సొసైటీ ఎన్నికలు కూడా వస్తాయని స్థానిక ఎన్నికల్లో మీకోసం కష్టపడతానని కేటీఆర్ అన్నారు. అధికారం పోయి 50 రోజులు కాలేదని ఆగమాగం కావద్దని అన్నారు. కాంగ్రెస్ ప్రలోభాలు, బీజేపీ భయానికో చెదిరిపోనవసరం లేదదన్నారు. ఐదేళ్ల క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం చేసుకోవాలని జిల్లా కమిటీని అనుబంధ సంఘాలను బలోపేతం చేసుకోవాలన్నారు. పనిచేసే వారికే పదవులు ఇచ్చి, పనిచేయని పెద్ద వాళ్లను గౌరవప్రదంగా తప్పుకునే విధంగా కోరతామన్నారు. పోయింది అధికారం మాత్రమేనని పోరాట పటిమ కాదన్నారు. రెండు సార్లు అధికారం ఇచ్చిన ప్రజలకు సర్వదా రుణపడి ఉంటామని అన్నారు. కొత్తగా ప్రతిపక్ష పాత్ర ఇచ్చారని దానిలోనూ రాణిస్తామని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో కంటే ప్రతిపక్షంలోనే డేంజర్ అని ప్రజలపక్షాన చీల్చి చెండాడడంలో గొంతు విప్పి ప్రశ్నించడంలో కేసీఆర్ కంటే పదునైన గొంతు భారతదేశంలో ఎక్కడా లేదన్నారు. కాంగ్రెస్ అరు గ్యారంటీలు కాదని 420 హామీలు ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. అలవీకానీ హామీలు ఇచ్చి రోజుకో కథ పుట్టించి ప్రజల దృష్టి మళ్లించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికలతో పాటు స్థానిక ఎన్నికలు కూడా వస్తాయని సంవత్సరం పొడవునా ఎన్నికలు ఉంటాయని కష్టపడి పనిచేయాలని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకునేలా డిమాండ్ చేయాలని అన్నారు.

● కారుకు సర్వీస్ అవసరం పడింది...

మన గుర్తు కారు, 14 ఏళ్లు ఉద్యమంలో ఉరికిందని, పదేళ్ల అధికారంలో ఉండి వంద స్పీడుతో అభివృద్ధి కోసం పనిచేశామన్నారు. 24 ఏళ్లు కారు రయ్‌మని ఉరకడంతో సర్వీస్ అవసరం పడిందని ఏమీ కాలేదని కేటీఆర్ అన్నారు. ఇది చిన్న స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని మళ్లీ మనమే అధికారంలోకి వస్తామని అన్నారు. ప్రజలు మనల్ని తీసి అవతల పారేయలేదని 39 స్థానాలు ఇచ్చారన్నారు. మాజీ పార్లమెంట్ సభ్యుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యుడుగా తెలంగాణలో జరిగిన ప్రాజెక్టులకు వచ్చిన అనుమతుల్లో నాపాత్ర ఉందని అన్నారు. జాతీయ రహదారులు మంజూరు చేయించానని అన్నారు. ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ తొమ్మిది వేల కోట్ల రూపాయలు తెచ్చానని చెప్పుకుంటున్నారని అవి ఉపాధిహామీ నిధులేనని అన్నారు. రైలు మార్గం కోసం చేసిన ప్రయత్నాలు గురించి వివరించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, పవర్‌లూం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, వెంకటస్వామి, కృష్ణహరి, సురేందర్‌రావు, రాజిరెడ్డి, ఎంపీపీలు పిల్లి రేణుక, వంగ కరుణ, మాలోతు బూల, పడిగెల మానస, జడ్పీటీసీలు లక్ష్మణ్‌రావు, కళావతి, నర్సయ్య, కొమిరిశెట్టి విజయ పాల్గొన్నారు.

● ముఖ్య నాయకులతో కేటీఆర్ సుదీర్ఘ చర్చలు...

సిరిసిల్ల నియోజకవర్గం బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం అనంతరం రాత్రి 9 గంటల వరకు తెలంగాణ భవన్‌లో సిరిసిల్ల మున్సిపల్, తంగళ్లపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల వారీగా కేటీఆర్ చర్చలు జరిపారు. మండలం నుంచి గ్రామస్థాయి వరకు పార్టీ బలోపేతంతో పాటు నాయకులు కార్యకర్తల్లో భరోసాను నింపారు. పార్లమెంట్ ఎన్నికల్లో పనిచేసే విధి, విధానాలపై మార్గనిర్దేశనం చేశారు.

● ఎంపీగా సంజయ్ ఏమి చేశాడో చెప్పాలి..

ఎంపీగా బండి సంజయ్ ప్రజలకు పనికి వచ్చే ఒక్క పని చేయలేదని కేటీఆర్ అన్నారు. ఏమి పనిచేశాడో చెప్పి ఓట్లు అడగాలని అన్నారు. వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న, ఇల్లందకుంట రాములవారి గుడులను నిధులుతేలేదన్నారు. కేసీఆర్ ఎంపీగా ఉన్న సమయంలో రైలు మంజూరు చేస్తే వినోద్‌కుమార్ కొంచెం ముందుకు తీసుకవచ్చినా సంజయ్ పట్టించుకోలేదన్నారు. ధర్మం కోసం పనిచేస్తే మతం పెట్టుకోవాలని అన్నారు. సిరిసిల్ల నేతన్నలు అతాలకూతలం అవుతుంటే పట్టించుకోలేదన్నారు. సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ కావాలని పది సార్లు కేంద్ర ప్రభుత్వాన్ని అడిగామన్నారు. బీజేపీ అధ్యక్షుడిగా సిరిసిల్ల, జమ్మికుంట నేతన్నలకు ఒక పథకం తేలేదని, దేవుడి పేరిట ఓట్లు అడగడమేనని అన్నారు. గతంలో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్ అయ్యిందని అన్నారు. కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను పెట్టి కాంగ్రెస్ ఓట్లు బీజేపీ బదలాయించారని అన్నారు.

ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

8



రుద్రంగిలో పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

కొనసాగుతున్న జనజాతర

- రాజన్న సన్నిధికి తరలివస్తున్న భక్తులు

7



ఆదివారం రాత్రి రాజన్న ఆలయ ఆవరణలో బస చేసిన భక్తులు

రాజకీయాలకతీతంగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బోయినపల్లి, జనవరి 28: రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు అభివృద్ధిలో భాగస్వాములుకావాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బోయినపల్లి మండలం కోరేం గ్రామంలో చెన్నాడి కుటుంబ సభ్యుల సహకారంతో నిర్మించిన గ్రామపంచా యతీ, పాఠశాల భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. అంతేకాకుండా వివిధ పార్టీల నాయకులు ఎన్నికల వరకే రాజకీయాలు అని ఎన్నికల ముగిసిన అనంతరం గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. రాజకీయంతో సంబంధం లేకుండా తాను ఈ కార్యక్రమానికి వచ్చానన్నారు. అంతేకాకుండా చెన్నాడి కుటుంబ సభ్యులు అభివృద్ధిలో మరింత పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్సీలు, చెన్నాడి సుధాకర్ రావు, సంతోష్ కుమార్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుస రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మండల రమణారెడ్డి, చెన్నాడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సిరిసిల్ల బల్దియాలో అవిశ్వాసం?

- కేటీఆర్ సమావేశానికి హాజరుకాని కౌన్సిలర్లు

సిరిసిల్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మున్సిపాలిటీలో అవిశ్వాసం వైపు కదలికలు మొదలయినట్లు తెలుస్తోంది. సిరిసిల్లలో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులతో ఆదివారం నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్లు కొందరు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. కౌన్సిలర్లు 12 మంది వరకు క్యాంపునకు వెళ్లారనే ప్రచారం జోరందుకుంది. కొందరు మాత్రం చైర్‌పర్సన్ తీరును నిరసిస్తూ అవిశ్వాసం వైపు వెళ్లినట్లుగా చెప్పుకుంటున్నారు. బీఆర్ఎస్ నుంచి ఎవరిని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా తెరపైకి తెస్తారనే ఊహాగానాలు జోరందుకున్నాయి.

అవిశ్వాసం అవాస్తం

సిరిసిల్ల టౌన్, జనవరి 28: సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసంపై సోషల్ మీడియాలో వస్తున్నది అవాస్తవం అని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇలాకాలో మున్సిపల్ చైర్‌పర్సన్‌పై 16 మంది కౌన్సిలర్ల అవిశ్వాసం అంటూ కొందరు సోషల్‌మీడియాలో వైరల్ చేస్తున్నారని అన్నారు. సిరిసిల్ల నియోజకవర్గం సమావేశానికి 33 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లలో దాదాపు 24 మంది కౌన్సిలర్లు హాజరయ్యారన్నారు. ఆరుగురు కౌన్సిలర్లు వారి వ్యక్తిగత కారణాల వల్ల రాలేకపోయారని కేటీఆర్‌తో జరిగిన సమావేశంలో కౌన్సిలర్లు పాల్గొన్నారని అన్నారు. అవిశ్వాసం పెట్టడానికి క్యాంప్‌నకు వెళ్లారని వస్తున్న పుకార్లను ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కోనరావుపేట, జనవరి 28: మండలంలోని నిమ్మపెల్లి గ్రామంలో చేకూట పద్మ, ఎగ్లాస్పూర్ గ్రామంలో నామకమలమ్మ మృతి చెందగా ఆ కుటుంబాలను ఆదివారం బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట సర్పంచ్ శ్రీనివాస్, ఎంపిటిసి ప్రతాపరెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, నాయకులు తిరుపతి, దేవయ్య, ప్రవీణ్, క్రాంతి, శ్రీకాంత్, నాగరాజు ఉన్నారు.

దుర్గంధం వెదజల్లుతున్న మల్లారం రోడ్డు

- బీటీ రోడ్డుపై పారుతున్న ఇళ్లలోని వ్యర్థపు నీరు - పట్టించుకోని అధికారులు



బీటీ రోడ్డు పక్కన పారుతున్న ఇళ్లలోని వ్యర్థపు నీరు



మల్లారం వైపు వెళ్లే బీటీ రోడ్డు పక్కన నిలిచిన మురుగు నీరు

వేములవాడ టౌన్, జనవరి 28: ఇళ్లలోని వ్యర్థపు నీరు బీటీ రోడ్డుమీద పారడంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ పట్టణంలోని నంది విగ్రహం చౌరస్తా సమీపంలో మల్లారం గ్రామం వైపు వెళ్లే బీటీ రోడ్డు పక్కన డ్రైనేజీ నిర్మాణం లేకపోవడంతో మురుకి నీరు రోడ్డుపై పారుతోంది. స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమి లేక స్థానికులు మురుగు రోడ్డుపైన పారకుండా ఉండేందుకు బీటీ రోడ్డుపక్కన కాలువను ఏర్పాటు చేశారు. కొన్ని ప్రాంతాల్లో మురుగు నిలిచిపోయి దోమలు, కీటకాలు వృద్ధి చెంది పందులకు నిలయంగా మారి దుర్గంధం వెదజల్లుతోందని చెబుతున్నారు. స్థానిక వాహనదారులు సైతం ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళితే బీటీ రోడ్డు పక్కన డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలంటే ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారన్నారు. డ్రైనేజీ ఏర్పాటుకు కాలం వెళ్లదీస్తున్నారని స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేపు జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీలు

సిరిసిల్ల టౌన్, జనవరి 28: రాజన్న సిరిసిల్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల మినీ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ (పరుగు పందెలు)పోటీలు ఉంటాయని ఆదివారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు, ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. 8, 10, 12, 14, సంవత్సరాల బాలబాలికలకు ట్రాక్ అండ్ ఫీల్డ్ 50 మీటర్లు, 100, 300, 400, 600 మీటర్ల రన్నింగ్(పరుగు పందెలు)పోటీలు ఉంటాయని తెలిపారు. అదే విధంగా స్టాండింగ్ బ్రాడ్ జంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీలో విజేతలైన బాలబాలికలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో పాటు మెరిట్ సర్టిఫికెట్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పోటీలో ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించిన 25 మంది బాలబాలికలను ఎంపిక చేసి భద్రాది కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీలకు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే బాలబాలికలు తహసీల్దార్ జారి చేసిన పుట్టిన రోజు ధృవీకరణతో రావాలని జిల్లా పరిధిలోని అన్ని మండలాల నుండి పోటీలలో బాలబాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు. వివరాలకు సెల్ : 7901464456 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

ముస్తాబాద్, జనవరి 28: కాంగ్రెస్ పార్టీ ద్వారానే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో ఆదివారం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వంద రోజుల్లో నెరవెర్చుకుంటుందన్నారు. ఓపిక లేకుండా బీఆర్ఎస్ నాయకులు విమర్శించడం సరికాదన్నారు. సాగు నీరు, తాగు నీరు అందించడంతో పాటు కరెంటును అందించే బాధ్యత కాంగ్రెస్ పార్టీదన్నారు. బీఆర్ఎస్ ఆరోపణలను నమ్మవద్దన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, ఏదూనూరి భాను, మిరుదొడ్డి భాను, అన్నం శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలి



తనిఖీ చేస్తున్న ఎస్ఐ రమేష్

వీర్నపల్లి, జనవరి 28: ప్రతీ వాహనదారుడు వాహనాలకు నంబర్ ప్లేట్లను కలిగి ఉండాలని ఎస్సై రమేష్ అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి ప్రధాన రహదారిపై ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్లు సరిగా లేని, ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించని వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ బాబు, సిబ్బంది రియాజ్, కార్తీక్ ఉన్నారు.

మల్కపేట రిజర్వాయర్ ప్రారంభోత్సవం ఎప్పుడో?

- గత నవంబర్‌లోనే ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసిన అప్పటి ప్రభుత్వం - ఎన్నికల కోడ్‌తో బ్రేక్



మల్కపేట గుట్టల మధ్య నిర్మించిన మల్కపేట ప్రాజెక్ట్



ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేసిన శిలాఫలకం



కట్ట పైకి వెళ్లడానికి ఏర్పాటు చేసిన రోడ్డు

కోనరావుపేట, జనవరి 28: మల్కపేట రిజర్వాయర్ పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నా ప్రారంభోత్సవానికి మోక్షం కలగడంలేదు. కోనరావుపేట కోనసీమగా మారుస్తానన్న గత ప్రభుత్వం దిగిపోయింది. పనులు పూర్తి చేసి కాంట్రాక్టర్ తట్ట బుట్ట సర్దుకొని వెళ్లిపోయారు. కాళేశ్వరం 9వ ప్యాకేజీ ఎత్తిపోతల పథకంలో భాగంగా మల్కపేట రిజర్వాయర్ 2013లో పనులు ప్రారంభించినప్పటికీ 2017 నుంచి పనుల్లో వేగం పంచుకుంది. మల్కపేట రిజర్వాయర్ సుమారు 470 కోట్లతో పనులు ప్రారంభించి పూర్తి చేశారు. మల్కపేట గ్రామ శివారులోని సుమారు ఐదు కిలోమీటర్ల పొడవున ఆరు కట్టలతో గుట్టల మధ్య పనులు పూర్తి చేశారు. మల్కపేట రిజర్వాయర్ నింపడానికి ఎత్తిపోతల పథకం ద్వారా మిడ్ మానేరు నుంచి సుమారు 11 కిలోమీటర్ల సొరంగం ద్వారా పనులు పూర్తి చేసి రిజర్వాయర్లో నీరు నింపే ప్రక్రియను అధికారులు సక్సెస్ చేశారు. భారీ పంపుల ద్వారా నీరు నింపే ప్రక్రియ విజయవంతం అయింది. గత సంవత్సరం నవంబరు నెలలో ప్రారంభోత్సవం చేయడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధమైంది. అంతలోనే శాసనసభ ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయింది. ఈ ప్రాజెక్టుకు దివంగత ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరరావు పేరు పెట్టాలని అధికారికంగా ధ్రువీకరించారు. కానీ ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభోత్సవానికి రిజర్వాయర్ నోచుకోలేదు. మల్కపేట రిజర్వాయర్ పనులు పూర్తయితే జిల్లాకు వరప్రదాయినిగా మారుతుంది. సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనైనా మల్కపేట రిజర్వాయర్‌ను ప్రారంభించి మూడు టీఎంసీల సామర్థ్యం గల ప్రాజెక్టులో నీరు నింపి కోనరావుపేట మండలాన్ని మరో కోనసీమగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పేద వైష్ణవులను ఆదుకోవాలి

ఇల్లందకుంట, జనవరి 28: రాష్ట్రంలోని నిరుపేద శ్రీవైష్ణవులను ఆర్థికంగా ఆదుకోవాలని వైష్ణవ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు డింగరి రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం ఆవరణంలో ఆదివారం శ్రీవైష్ణవ సేవా సంఘం ఏర్పాటు చేసి 25ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డింగరి రవికుమార్ మాట్లాడుతూ శ్రీవైష్ణవి సేవా సంఘం పేద వైష్ణవులకు ఉపయోగపడే విధంగా ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న పేద వైష్ణవులకు ఆర్థిక, వైద్య, విద్య పరంగా ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. అందులో నిరుపేద వైష్ణవులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. .కార్యక్రమంలో డింగరి శ్రీధర్, సముద్రాల ప్రసాదచార్యులు, సముద్రాల సుదర్శనాచార్యులు, శేషం రామాచార్యులు, శేషం వంశీధరాచార్యులతో పాటు 350 మంది పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ స్థాయి సమావేశం

జమ్మికుంట రూరల్, జనవరి 28: జమ్మికుంట పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) హుజూరాబబాద్ నియోజక వర్గ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధానకార్యదర్శి అంకని బాను, పార్లమెంట్ ఇన్‌చార్జి దాసరి ఉష, రాష్ట్ర కార్యదర్శి దొడ్డె సమ్మయ్య, కన్వీనర్లు శిరీష, జన్ను స్వరూప, మిడిదొడ్డి స్వప్న హాజరయ్యారు. బీఎస్పీ అభ్యర్థులను పార్లమెంట్‌కు పంపేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానంపై కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో మంద బాలన్న, మేకల రవీందర్, మారపల్లి మొగిలయ్య, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొనసాగుతున్న జనజాతర

- రాజన్న సన్నిధికి తరలివస్తున్న భక్తులు - గర్భాలయ ప్రవేశం నిలిపివేసిన అధికారులు



స్వామి వారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ, జనవరి 28: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజ రాజేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తజనంతో కిటకిట లాడుతోంది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర తేదీ సమీపిస్తున్న క్రమంలో వేములవాడకు వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. దీంతో రాజన్న క్షేత్రంలో భక్తజన జాతర కొనసాగుతోంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి సుమారు 40 వేల మందికి పైగా భక్తులు తమ ఇష్టదైవమైన రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారు జామునే ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు చేశారు. అనంతరం సర్వదర్శనం శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా మూడు రోజులుగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి స్వామివారి దర్శనం త్వరగా సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా భక్తులు నందీశ్వరుడు వద్ద నుంచి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్న పూజలు నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపునకు సుమారు నాలుగు నుంచి ఐదు గంటల పైగా సమయం పడుతోంది. మరోవైపు బద్ది పోచమ్మ ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. వందలాది మంది భక్తులు తలపై బోనం పెట్టుకొని క్యూ లైన్లలో నిరీక్షించారు. తమ వంతు రాగానే ఆలయంలో చేరుకుని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎన్టీపీసీ రిజర్వాయర్‌ను సందర్శించిన ఫిషరీస్ సొసైటీ



రిజర్వాయర్‌ని పరిశీలిస్తున్న బృందం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 28: రామగుండం ఎన్టీపీసీ జలాశయాన్ని ఆదివారం తెలంగాణ ఫిషరీస్ సొసైటీ బృందం సందర్శించింది. ఎన్టీపీసీ జలాశయంలో తేలియాడే సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఇటీవల ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈనేపథ్యంలో సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుతో మత్యకారులపై ఎటువంటి ప్రభావం చూపే అవకాశం ఉన్నదనే అంశాన్ని పరిశీలించారు. సుమారు 900 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పిన ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల తేలియాడే సౌరవిద్యుత్ కేంద్రం దాదాపు సగానికి పైగా జలాశయ విస్తీర్ణం అవసరం ఉంటుందని ఎన్టీపీసీ అధికారులు ఫిషరీస్ సొసైటీ బృందానికి వివరించారు. గతంలో జలాశయంలో చేపల వేటను కొనసాగించిన మత్స్యకారులను సోలార్ విద్యుత్ కేంద్ర ఏర్పాటు తర్వాత అనుమతించడం లేదని అధికారులు తెలిపారు. విద్యుత్ కేంద్ర ఏర్పాటు కారణంగా ఉపాధిని కోల్పోతున్నామని సమీప గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఫిషరీస్ సొసైటీ ప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. జలాశయంలో సౌర పలకల ఏర్పాటు చేయగా మిగిలిన విస్తీర్ణంలో తమకు చేపలు పట్టుకునే అవకాశం కల్పించే లా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని వారు ఫిషరీస్ సొసైటీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. జలాశయాన్ని పరిశీలించిన వారిలో తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల అధ్యక్షులు కనకయ్య, చంద్రశేఖర్‌తో పాటు ప్రతినిధులు ఉన్నారు.

రాజన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి

వేములవాడ, జనవరి 28: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి శ్రీసుధ దర్శించుకున్నారు. ఆదివారం నాడు కుటుంబ సమేతంగా స్వామి వారి దర్శనం కోసం వచ్చిన ఆమెకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జస్టిస్ స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఆలయ ఏఈవో బి శ్రీనివాస్ ప్రసాదం అందజేశారు. జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, పట్టణ సీఐ కరుణాకర్ అంతకు ముందు ఆలయ గెస్ట్ హౌస్ వద్ద స్వాగతం పలికారు. ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకుడు అల్లి శంకర్, ఇన్‌స్పెక్టర్ పవన్ అధికారులు వారి వెంట ఉన్నారు.



జస్టిస్ శ్రీసుధకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఏఈవో శ్రీనివాస్

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం

- ఎంపీ బండి సంజయ్ పూజలు



ఎంపీ బండి సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయకమిటీ సభ్యులు

గన్నేరువరం, జనవరి 28: మండలంలోని మైలారం గ్రామంలోని శ్రీమల్లికార్జున స్వామి కల్యాణం, పెద్దపట్నాలు, జాతర ఉత్సవాలు ఆదివారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్వామివారిని దర్శించుకున్నారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెలించుకున్నారు. ఆలయకమిటీ దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్ర మంలో ఆలయకమిటీ చైర్మన్ వరాల పర్శరాములు, బీజేపీ మానకొండూరు నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి, జడ్పీడీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, బీజేపీ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు నగునూరి శంకర్, గంప వెంకన్న, నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, తిప్పర్తి నిఖేష్, ఆలయకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను దర్శించుకున్న ఎంపీ

మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయం, గన్నేరు వరంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, మైలారంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయాలను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మైలారం, ఖాసింపేట ఆలయాలలో ఆయనకు గజమాలలను వేసి, పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, బీజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పర్తి నిఖేష్, మచ్చ మురళి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలి

- హైకోర్టు న్యాయమూర్తి పి శ్రీసుధ



జువైనల్ కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి పి శ్రీసుధ

కరీంనగర్ లీగల్, జనవరి 28: కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని హైకోర్టు న్యామూర్తి పి శ్రీసుధ అన్నారు. ఆదివారం కరీంనగర్ కోర్టు భవన సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐదవ అదనపు జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (జువైనల్)కోర్టును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి వేణుగోపాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్య త్తులో బాల నేరస్తుల కేసులు లేని జిల్లాగా కరీంనగర్ ఏర్పడాలని ఆశిస్తున్నానన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి వేణుగోపాల్ మాట్లాడుతూ న్యాయవాదులు కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తే సత్వర న్యాయం జరిగి దేశంలోనే కరీంనగర్ మొదటి స్థానంలో ఉండాలని కోరుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ, మెజిస్ట్రేట్ సరళరేఖ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రఘునందన్‌రావు, మేజిస్ట్రేట్‌లు, ప్రభుత్వ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 36 ఆలయాల ధర్మకర్తల మండళ్లకు నోటిఫికేషన్

కరీంనగర్ కల్చరల్, జనవరి 28: దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని 36 ఆలయాల ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ అయింది. ఈ మేరకు రాష్ట్ర కమిషనర్ వి.అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ ఎ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కరీంనగర్ జిల్లాకు సంబంధించి విజయగణపతి సాయిబాబా దేవాలయం, పాతబజార్ గౌరీశంకరాలయం, మంకమ్మతోట భక్తాంజనేయస్వామి ఆలయం, జెడ్‌పి క్వార్టర్స్‌లోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయాలు, ప్రొద్దుటూరి ట్రస్టు, భారత్ టాకీస్‌రోడ్ వీరాంజనేయస్వామి ఆలయం, మంకమ్మతోట వేంకటేశ్వరాలయం, ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, రాంపూర్ గిద్దెపెరుమాళ్ళ ఆలయం, కోతిరాంపూర్ పోచమ్మ ఆలయం, కట్టరాంపూర్ అభయాంజనేయస్వామి ఆలయం, గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, హుజూరాబాద్‌లోని హనుమాన్ ఆలయం, కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం, తిమ్మాపూర్ నల్లగొండ సీతారామస్వామి ఆలయం, జమ్మికుంట వేంకటేశ్వరాలయం ఉన్నాయి. జగిత్యాల జిల్లాలోని శ్రీనివాస భవానీ అంజనేయ శంకరాలయం, బండ లింగాపూర్ గండి హనుమాన్ ఆలయం, మల్లన్నపేట మల్లికార్జునస్వామి ఆలయం, రాయికల్, కొత్తపేట రాజరాజేశ్వర నాగాలయం, పొలాస పౌలస్త్రీశ్వరాలయం, జగిత్యాల రాజరాజేశ్వరాలయం, రాయికల్ ఆంజనేయస్వామి ఆలయం, మెట్‌పల్లి లక్ష్మారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు, మల్లాపూర్ గంగాగౌరీశ్వరస్వామి ఆలయం, కోరుట్ల వేంకటేశ్వరాలయం, కోటిలింగాల కోటేశ్వరాలయం, ఎరదండి మల్లికార్జున గంగామాత ఆలయం, సుందిళ్ళ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉన్నాయి. మంథని మహాలక్ష్మీ ఆలయం, లక్ష్మీనారాయణస్వామి ఆలయం, పెద్దాపూర్ యోగానంద లక్ష్మీనారసింహస్వామి ఆలయం, సిరిసిల్ల జిల్లాలోని లక్ష్మీవేంకటేశ్వరాలయం, శివసాయిబాబా ఆలయం, పోచమ్మ ఆలయం, విశ్వనాథ స్వామి ఆలయం ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని ఆసక్తి గల వారు ధర్మకర్తలుగా ఉండేదుకు తమ దరఖాస్తులను 20 రోజుల లోపు ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో గానీ, రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యాలయంలో గానీ సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి దేవాదాయ, పోలీసు శాఖల నుంచి వెరిఫికేషన్‌కు పంపిస్తారని, ఆ తర్వాత ఎంపికైన వారి లిస్టు రాష్ట్ర కమీషనరేట్ ద్వారా వస్తుందని తెలిపారు. అనంతరం ఎంపికైన వారితో పాలక వర్గ ప్రమాణ స్వీకారం చేయిస్తామని తెలిపారు.

విద్యుత్ బిల్లులు కాజేసిన కేసులో ఒకరి అరెస్టు

మానకొండూర్, జనవరి 28: మానకొండూర్‌లోని వెనుకబడిన తరగతుల సమీకృత హాస్టల్‌లో రూ. 31లక్షల విద్యుత్ బిల్లులను కాజేసిన కేసులో అప్పటి వార్డెన్ అన్నలదాసు లక్ష్మీనారాయణను సీఐ రాజ్‌కుమార్ అరెస్టు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌లోని హాస్టల్ వార్డెన్‌గా 2018 నుంచి 2021 వరకు అన్నలదాసు లక్ష్మీనారాయణ విధుల్లో కొనసాగారు. హాస్టల్‌లోని 31లక్షల రూపాయల మేరకు విద్యుత్ బిల్లులను కాజేసాడని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్‌కుమార్ అతడిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈ నెల 19న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరుపాలని స్థానికులు కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మానకొండూర్, జనవరి 28: మండలంలోని లింగాపూర్ గ్రామ శివారులో ఆదివారం పేకాడుతున్న ఆరుగురిని కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. వారి నుంచి 14వేల రూపాయలు స్వాధీనం చేసుకొని మానకొండూర్ పోలీసులకు అప్పగించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

పెద్దపల్లి రూరల్, జనవరి 28: మండలంలోని పాలితం గ్రామ పంచాయతీ అనుబంధ పుట్టపల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తోకారం శ్రీనివాస్‌కు చెందిన పూరిగుడిసె దగ్ధమైంది. మంటలు చెలరేగుతుండటంతో స్థానికులు గమనించి మంటలను ఆర్పివేశారు. సంఘటన స్థలానికి ఫైర్ అధికారి దేవనంది శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంటలను పూర్తిగా ఆర్పేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.50 వేల వరకు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

గంగపుత్రుల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి



మాట్లాడుతున్న గంగపుత్రుల ఐక్య రాష్ట్ర అధ్యక్షుడు కావూరి వెంకటేష్

మెట్‌పల్లి, జనవరి, 28: రాష్ట్రంలోని గంగపుత్రుల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించాలని గంగపుత్రుల ఐక్య రాష్ట్ర అధ్యక్షుడు కావూరి వెంకటేష్ కోరారు. ఆదివారం పట్టణంలోని నరేంద్ర గార్డెన్‌లో నియోజక వర్గంలోని గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో చెపలు పడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు మరణించిన వారికి బీమా సౌకర్యం, 50 ఏండ్లుపై పడిన వారికి పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా డీఎఫ్‌సీఎస్ చైర్మన్ పల్లికొండ ప్రవీణ్ మాట్లాడుతూ జీవో 06 రద్దు చేయాలని, గంగపుత్రులకు ఉచిత వాహనాలు, చెరువుల అభివృద్ధి, చెపపిల్లలకు బధులుగా చెరువులో నాణ్యమైన చేపలను చెరువులో పెంచుకోవడానికి నగదును అందజేయాలనినియోజక వర్గంలో చేపల పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామంలో సంఘ భవనాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి నర్సింగరావు, కొమిరెడ్డి కరంచంద్ మాట్లాడుతూ గంగపుత్రుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌సీఎస్ డైరెక్టర్లు పర్రే శంకర్‌రాజు, ఎల్లా శ్రీనివాస్, పల్లికొండ భూమేష్, సముద్రాల రూప, శ్రీనివాస్, లచ్చయ్య, రాజయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు, గంగపుత్రులు పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో పడి మాజీ సర్పంచ్ మృతి

బీర్‌పూర్, జనవరి 28: మండలంలోని తాళ్లధర్మారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఏనుగు ఎల్లారెడ్డి(54) ఆదివారం ఉదయం తాను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న పొలానికి నీరు పారించడం కోసం వెళ్లాడు. పొలానికి వెళ్లిన ఎల్లారెడ్డి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పొలం వద్దకు వెళ్లి గమనించారు. అప్పటికే ఎల్లారెడ్డి వ్యవసాయ బావిలో పడి మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. ఎల్లారెడ్డి కుమారుడు మహేందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ గజేంధర్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మాజీ ఎమ్మెల్యే బిల్లులు రాకుండా అడ్డుకున్నారు

- గునుకుల కొండాపూర్ సర్పంచ్ భర్త లింగంపల్లి బాలరాజు ఆవేదన

గన్నేరువరం, జనవరి 28: మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తమను నాలుగేళ్లుగా మానసికంగా వేధించి, బిల్లులు రాకుండా అడ్డుకున్నారని మండలంలోని గునుకుల కొండాపూర్ సర్పంచ్ భర్త లింగంపల్లి బాలరాజు సెల్ఫీ వీడియోను విడుదల చేసి మండల సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. తాము ఆర్థికంగా నష్టపోవడంతో ఉన్న 30 గుంటల భూమిని అమ్ముకుని కరీంనగర్‌కు పోయి కులవృత్తి చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నామని చెప్పారు. తమ ఉసురు అతడికి తగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీడియో వాట్సప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



లింగంపల్లి బాలరాజు

ముందుకు రాని కాంట్రాక్టర్లు



కొండగట్టు అంజన్న ఆలయం



తలనీలాలు తీస్తున్న సిబ్బంది

- ఐదు సార్లు తలనీలాల టెండర్లు వాయిదా
- మరో సారి 1న నిర్వహణకు ఏర్పాట్లు
- ఆరు నెలలుగా దేవస్థానం తరుపున సేకరణ

మల్యాల, జనవరి 28: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధి లో భక్తులు సమర్పించే తలనీలాలకు టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. గతంలో జీఎస్టీ నెపం, ప్రస్తుతం మార్కెట్‌లో కురులకు ధ రలు పడిపోయాయని పేర్కొంటూ తలనీలాలు సేకరించే కాంట్రాక్టర్ టెం డర్లలో పాల్గొనడం లేదు. నెల రోజులుగా దేవస్థానం అధికారులు అయిదు సార్లు టెండర్లు ఆహ్వానించగా టెండర్లు దాఖలు కాలేదు. క్రితం సారి దానిలో ఒక్కరు మాత్రమే టెండర్ దాఖలు చేయగా దాన్నీ రద్దు చేసిన అధి కారులు మరో సారి ఫిబ్రవరి 1న ఆరవ సారి టెండర్ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంజన్న భక్తులు తమ మొక్కుల రూపేణ తలనీలాలు స్వామి వారికి సమర్పించడం ఆనవాయితీ కాగ వాటిని సేకరించడానికి దే వస్థానం తరుపున టెండర్లు నిర్వహించి వాటి సేకరణ వ్యాపారులకు అప్పగిస్తుంటారు. నాలుగేళ్లగా జీఎస్టీని వ్యాపారులకు అంటగ ట్టడంతో సేకరణపై సందిగ్ధం ఏర్పడింది. హెచ్చు పాట దారు తన టెండర్ ధరలపై జీఎస్టీ చెల్లించాలనే నిబంధనలు కురుల సేకరణపై ప్రభావం పడ్డాయి. దీంతో వ్యాపారులు టెండర్లకు ముందుకు రాక పోగా ఇప్పుడు అంతర్జా తీయ మార్కెట్‌లో కురులకు ధరలు పడిపోయాయని కాంట్రాక్టర్లు టెండర్లకు రావడం లేదు. దీంతో తలనీలాల సేకరణ దేవస్థానం అధికారుల పై నే పడింది. ఆరు నెలలుగా సిబ్బంది వాటిని సేకరిస్తుండగా వాటిని భద్ర పరచడం ఇబ్బందిగా మారింది.

● **అప్పుడు జీఎస్టీ.. ఇప్పుడు ధరల లేమి..**

తలనీలాల సేకరణపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ అమలు చేయాలనే ఆదే శాల నేపథ్యంలో జీఎస్టీ నిబంధనలతో వ్యాపారులు టెండర్లలో పాల్గొనడం లేదు. అయితే హెచ్చు పాటదారుకు టెండర్ సొమ్ములపై జీఎస్టీ విధించి చెల్లించాలనే నిబంధనలపై ఓ వ్యాపారి జీఎస్టీ కింద చెల్లించాల్సిన సొమ్ములు చెల్లించకుండా న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఇప్పుడది కోర్టు పరిధి లో ఉండడంతో మరో వ్యాపారి తన టెండర్ కాల పరిమితి ముగిసినప్పటికీ జీఎస్టీ కింద చెల్లించాల్సి సొమ్ములు బకాయిలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. జీఎస్టీని మినహాయిస్తేనే టెండర్‌లో పాల్గొంటామని పేర్కొన్న కాంట్రాక్టర్లు తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో కురుల ధరలు పడిపోయాయని ధరలు తగ్గిస్తేనే టెండర్లకు ముందుకు వస్తామని అంటున్నారు. ఇందులో భాగంగా జూలైలో తలనీలాలకు దేవస్థానం అధికారులు టెండర్లు పిలవగా వ్యాపారులు ముందుకు రాలేదు. అప్పటి నుంచి శుక్ర వారం వరకు దేవస్థానం అధికారులు ఐదు సార్లు టెండర్లు నిర్వహించారు. కంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో వాయిదా వేసుకుంటూ వెలుతున్నారు.

● **క్రితం సారి..**

క్రితం సారి ఏడాది కాలపరిమితికి గాను రూ.3.65కోట్లు కాగా దేవస్థా నం అధికారులు ప్రతి ఏటా పది శాతం పెంపుతో టెండర్లు నిర్వహిస్తుం టారు. జీఎస్టీ, ధరల లేమితో కాంట్రాక్టర్లు టెండర్లకు ముందుకు రాకపోవ డంతో టెండర్ సొమ్ములను తగ్గిస్తారా అనేది దేవాదాయ శాఖ అధికారు లు తేల్చాల్సి ఉంది. దేవస్థానం అధికారులు ఇప్పటి వరకు అయిదు సార్లు వేలంకు షెడ్యూల్ జారీ చేశారు. నాలుగు సార్లు ఎవరూ పాల్గొనగకపోగా రెండు రోజుల క్రితం ముగిసిన దానికి మాత్రం ఒక్కరు పాల్గొన్నారు. దీం తో అది రద్దు చేయాల్సి వచ్చింది. మళ్లీ గురువారం నిర్వహించడానికి అధి కారులు సన్నాహాలు చేస్తున్నారు.



కమిషనర్‌కు నివేదిస్తాం..

కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనకపోవడం పై కమిషనర్ దృష్టికి తీసు కెళ్లాము. మార్కెట్‌లో ధరలు లేవని వ్యాపార సంస్థలు వెనుకంజ వేస్తున్న ట్లు తెలుస్తోంది. మరో సారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతాం. తలనీ లాల టెండర్‌కు అధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాం. టెండర్‌లో పాల్గొంటే వారి అభిప్రాయాలను కమిషనర్‌కు నివేదించే అవకాశం ఉంటుంది.

- పి వెంకటేష్, ఈవో

● **తమ వాదనలు చెప్పకుండా, టెండర్లకు దూరం**

అయితే కాంట్రాక్టర్లు తాము ఏ కారణం చేత టెండర్‌కు దూరంగా ఉం టున్నారో చెప్పాల్సి ఉండగా టెండర్‌లో పాల్గొనకపోవడం దేవస్థానం అధి కారులకు కూడా తలనొప్పిగా మారింది. టెండరులో పాల్గొని జీఎస్టీ కాని మార్కెట్‌లో ధరలు లేవని తేల్చి చెబితే దాన్ని దేవస్థానం అధికారులు దే వాదాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లె అవకాశం ఉంది. గతంలోనూ పలు మార్లు నిర్వహించిన టెండర్‌లో తక్కువకు పాట పాడితే కమిషనర్ కు తెలిపి తగ్గించి అప్పగించిన దాఖలాలు ఉండగా ఇప్పుడు కూడా కాం ట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొంటే తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

● **దేవస్థానం తరుపున సేకరణ**

తలనీలాల టెండర్ గత జూలైతో ముగియగా అంతకు ముందే నిర్వహించిన టెండర్‌లో వ్యాపార సంస్థలు పాల్గొనకపోవడంతో దేవస్థానం త రుపున అధికారులు తలనీలాలు సేకరిస్తున్నారు. ఆగస్టు నుంచి దేవస్థా నం సిబ్బందే వాటిని సేకరిస్తూ భద్రపరుస్తున్నారు. ఇది అధికారులకు ఇ బ్బందికరంగా పరిణమించింది. సేకరించిన తలానీలాల నిల్వలు పెరిగిపో తుండగా ప్రస్తుతం సేకరిస్తున్న తలనీలాలను టెండర్ అయ్యాక సదరు వ్యాపారికి అప్పగించేందుకు అధికారులు నిర్ణయించారు.

విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకట్

సిరిసిల్ల రూరల్, జనవరి 28: రాష్ట్రంలో విద్యారంగాన్ని కాపా డడంతో పాటు రాబోయే బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం అధికంగా నిధులను కేటాయించి విద్యారంగాన్ని పరిరక్షించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ వెంకట్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా స్థాయి విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి వెంకట్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో విద్యారంగాన్ని పూర్తిగా ధ్వంసం చేసిందన్నారు. నూతనం గా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారం గాన్ని పరిరక్షించాలని కోరారు. రాబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తన భావజాలాన్ని ప్రజలపై రుద్దుతోందని, ప్రజల భావోద్వేగాలను రాజకీ యాలకు వాడుకుంటుందన్నారు. విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తోందన్నారు. భారత రాజ్యాంగ విలువలపై ప్రజలకు అవగహన కల్పించాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందే రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవాలన్నారు. వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, ఉపాధ్య క్షుడు అంబటి రమేష్, కోశాధికారి పర్కాల రవీం దర్, జిల్లా కార్యదర్శులు పాముల స్వామి, పోలాస మల్లేశం, కొత్వాల్ ప్రవీణ్, పాశం భాస్కర్, కొక్కుల బాలరాజు, తుమ్మనపెల్లి నరేష్, పసుల సత్యం పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఆర్టీసీ బస్సు అద్దాల ధ్వంసం

మల్యాల, జనవరి 28: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేశాడు. దిగువ కొండగట్టు వద్ద జగిత్యాల వైపు వెలుతున్న ఆర్టీసీ బస్సు వెనుకాల అద్దాలపై ఆ వ్యక్తి బండరాయితో కొట్టడంతో అద్దం పగిలింది. ప్రయాణికులు తక్కువ ఉండడంతో ప్రమాదమేమి చోటుచేసుకోలేదు. అయితే అద్దానికి అయ్యే ఖర్చులు భరిస్తానని సదరు వ్యక్తి పేర్కొనడంతో ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోయినట్లు తెలిసింది.

సర్పంచ్ శ్రీధర్ కాంగ్రెస్‌లో చేరికకు రంగం సిద్ధం

- 30న మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో చేరిక

గంభీరావుపేట, జనవరి 28: గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ కటకం శ్రీధర్ కాంగ్రెస్ పార్టీలో చేరికకు రంగం సిద్ధమైంది. ఈ నెల 30న రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో సర్పంచ్ శ్రీధర్ కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సమాచారం. ముందు నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన సర్పంచ్ శ్రీధర్ 2020లో బీజేపీలో, తరువాత 2022లో బీఆర్‌ఎస్‌లో చేరారు. పంచాయితీరాజ్ దినోత్సవం సందర్భంగా జాతీయ ఉత్తమ సర్పంచ్‌గా శ్రీధర్ అవార్డు అందుకున్నారు. ఎట్టకేలకు తిరిగి సర్పంచ్ సొంత గూటికి చేరుతున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 30న గంభీరావుపేటలో షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు ఆయా గ్రామాల్లో గ్రామపంచాయతీ నూతన భవనాల ప్రారంభోత్సవానికి మంత్రి పొన్నం ప్రభాకర్ వస్తున్నారు. ఈ క్రమంలో సర్పంచ్ శ్రీధర్ తన అనుచరులతో కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై సర్పంచ్‌ను వివరణ కోరగా కాంగ్రెస్‌లో చేరడం వాస్తవమేనని, కానీ ఇంకా తేదీ ఖరారు కాలేదని చెప్పారు.

పొదుపు సంఘాలను పునరుద్ధరించాలి



సమావేశంలో పాల్గొన్న దివ్యాంగులు, నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 28: నిలిచిపోయిన పొదుపు సంఘాలను పునరుద్ధరించాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మంగళారపు రాజేందర్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం గాంధీనగర్‌లో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో దివ్యాంగుల పొదుపు సంఘాలు నడుస్తున్నాయని అన్నారు. కొత్త సంఘాలను ఏర్పాటు చేస్తూ నిలిచిపోయిన పొదుపు సంఘాలకు గల కారణాలను గుర్తించి అధికారులు వాటిని పునరుద్ధరించాలని అన్నారు. సమావేశంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు యెల్లె హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి మామిడాల నరేష్, నాయకులు బొద్దుల రవి, ఎండీ ఖాదర్, సంధ్య, లత, రమేష్, రాములు, నాగభూషణం, శ్రీనివాస్, రమేష్, మన్మోహన్, రాజు, దివ్యాంగులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో దేవదాస్‌కు ఘన సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 28 : తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా కోశాధికారి దొంత దేవదాస్‌ను ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియే షన్ వార్షికోత్సవం ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్‌కు కార్డులు ఇస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం విశేష కృషి చేస్తున్న దేవదాస్‌ను వార్షికోత్సవం వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి భాస్కర్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర‌రెడ్డి, తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి ఆర్ నర్సయ్య సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య, నాయకులు మిట్టపల్లి రాములు, గుడ్ల శ్రీధర్, ఇరుకుల్ల భాస్కర్, తిప్పర్తి రమేష్, అబ్బా నాగరాజు, గౌరిశెట్టి అనందం, చెన్నమనేని రామరాజు, గడ్డం విఠల్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గంభీరావుపేట, జనవరి 28: గంభీరావుపేట మండల కేంద్రంలోని మా అనాద వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కామారెడ్డికి చెందిన డాక్టర్ మల్లే జన్మదిన సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, దాదాపు 70 వేలు విలువ చేసే మందులను ఉచితంగా అందజేశారు. వృద్ధులకు షుగర్ టెస్ట్, బీపి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారందరికి సరిపడు మందులను అందజేశారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, వృద్ధులకు మందులను అందజేసిన కామారెడ్డి వైద్యులకు మా స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకులు మల్లుగారి నర్సాగౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్రికెట్ విజేతలకు ట్రోఫీల అందజేత



ట్రోఫీలను అందజేస్తున్న నాయకులు

తంగళ్ళపల్లి, జనవరి 28: మండలంలోని చింతల్‌ఠాణా గ్రామంలో కాంగ్రెస్ నేత, బస్వాపూర్ ఉపసర్పంచ్ సత్తు శ్రీనివాస్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించి న క్రికెట్ పోటీల్లో విజేతలకు మెమోంటోలను ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ అందజేశారు. యువకులు చదువుతో పాటు ఆటల్లో రాణించాల ని యువతకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. క్రికెట్ పోటీలో మొదటి, ద్వితీయ స్థానంలో నిలిచిన విజేతలకు మెమోంటోతో పాటు నగదును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ రాజు, కిసాన్ సెల్ అధ్యక్షుడు పర్శరాములు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సాయిప్రసాద్, జిల్లా కాంగ్రెస్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు గుగ్గిళ్ళ భరత్ గౌడ్, నాయకులు మాందాటి తిరుపతియాదవ్, చరణ్‌యాదవ్ పాల్గొన్నారు.

మంకు రాజయ్య సేవలు చిరస్మరణీయం

సిరిసిల్ల టౌన్, జనవరి 28: మాజీ మండల విద్యాధికారి మంకు రాజయ్య సేవలు చిరస్మరణీయం అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు అన్నారు. ఆదివారం బోనాల శివారులోని మైదానంలో మంకు రాజయ్య స్మారక టీచర్స్ ప్రీమియం లీగ్ ఫైనల్స్‌లో విజయం సాధించిన జట్టుకు ముఖ్య అతిథి పర్శ హన్మండ్లు ట్రోఫీని అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంకు రాజయ్య విద్యారంగానికి చేసిన సేవలకు గానూ ఎల్లారెడ్డిపేట మండల వనరుల కేంద్రానికి మంకు రాజయ్య స్మారక వనరుల కేంద్రంగా మార్చి ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న పర్శ హన్మండ్లు

ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, జనవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఆదివారం కృతజ్ఞత ర్యాలీలో పాల్గొన్నారు. గోవిందరావుపేట తండాలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి మహిళా కమ్యూనిటీ భవనానికి జడ్పీ చైర్‌పర్సన్ అరుణరాఘవరెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాలు బాగుంటే రాష్ట్రాలు, దేశాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని అన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాలు సంక్షేమ పథకాలు అమలుకు ప్రభుత్వానికి ప్రజల మధ్యలో వారధిగా ఉంటాయని అన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని అన్నారు. ఆరోగ్యశ్రీని ఐదు లక్షల నుంచి 10 లక్షల వరకు పెంచామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఇప్పటికే ఇచ్చిన హామీల్లో రెండు నెరవేర్చామని అన్నారు. మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని అన్నారు. అనంతరం మామిడిపల్లి శివాలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి కార్యకర్తలతో కలిసి మొక్కును చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత, జగన్నాథ్, కొక్కుల భారతి, కాంగ్రెస్ జిల్లా నాయకులు జగన్మోహన్ రెడ్డి, కచ్చకాయల ఎల్లయ్య, చేపూరి గంగాధర్, చందనగిరి గోపాల్, గొట్టే రుక్మిణి, తాళ్లపల్లి ప్రభాకర్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, నందు గౌడ్, లింగారెడ్డి, కిషన్ రెడ్డి, కేతిరెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రకాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..

రుద్రంగి: స్వగ్రామైన రుద్రంగిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని రెండు పల్లె దవాఖానలు, ఎస్సీ హాస్టల్ రినోవేషన్, ప్రభుత్వ పాఠశాలలో డైనింగ్ హాల్‌లను ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూరమ్మ చెరువు ప్రాజెక్టు నిర్మాణంతో పాటు కుడి, ఎడమ కాలువ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడామన్నారు. వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరానన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ ఎత్తు పెంచాలని ప్రధానోపాధ్యాయులు కోరగా వెంటనే స్పందించిన ఆది శ్రీనివాస్ అధికారులతో మాట్లాడి పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ముందుగా ఆది శ్రీనివాస్‌ను ప్యాక్స్ డైరెక్టర్ కెసిరెడ్డి నర్సరెడ్డి శాలువతో ఘనంగా సన్మనించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, జడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, సర్పంచ్ తర్రె ప్రభలతమనోహర్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కంటె రెడ్డి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు గండి నారాయణ, డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పల్లి గంగాధర్, బైరి గంగమల్లయ్య, పిడుగు లచ్చిరెడ్డి, తర్రె లింగం, ఇప్ప మహేష్, మాడిశెట్టి అభిలాష్, గంధం మనోజ్, స్వర్గం పరంధాములు, సిరికొండ రవి, సూర యాదయ్య, దర్న మల్లేశం, పూదరి మహిపాల్, ఎర్రం అరవింద్, చేప్యాల గణేష్, గోల్లెం నర్సింగ్, గుగ్గిళ్ల వెంకటేశం, దువ్వక గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మామిడిపల్లిలో వృద్ధురాలిని పలకరిస్తున్న ఆది శ్రీనివాస్



రుద్రంగి గ్రామపంచాయతీ పాలకవర్గంతో ఆది శ్రీనివాస్

● సర్పంచ్, పాలకవర్గానికి సన్మానం..

రుద్రంగి: గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో ఆదివారం రుద్రంగి గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్, పంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి, పంచాయతీ సిబ్బందిని శాలువలతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ తర్రె ప్రభలతమనోహర్, ఉపసర్పంచ్ బైరి గంగమల్లయ్య, వార్డు సభ్యులు పల్లి గంగాదర్, గండి నారాయణ, ఎర్రం గంగనర్సయ్య, పిడుగు లచ్చిరెడ్డి, మాడిశేట్టి ఆభిలాష్, చేప్యాల గణేష్, తర్రె లింగం, భూక్య గణేష్, గంధం మనోజ్, గోల్లెం నర్సింగ్, దువ్వక గంగాదర్, కార్యదర్శి రామ్‌దాస్ పాల్గొన్నారు.

కేజ్‌వీల్స్‌తో ధ్వంసమవుతున్న రోడ్లు

- చక్రాలకు రబ్బరు తొడుగులు లేకే సమస్య - పట్టించుకోని అధికారులు - రైతుల్లో అవగాహన కరువు



రోడ్డుపై వెళ్తున్న కేజ్‌వీల్స్‌తో ఉన్న ట్రాక్టర్

చందుర్తి జనవరి 28: కేజ్‌వీల్స్ తాకిడికి కోట్లు ఖర్చుచేసి అభివృద్ధి పరిచిన రోడ్లు ఛిద్రమవుతున్నాయి. వేసిన రహదారులు మూన్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. రైతులకు అవగాహన లేక రోజూ పొలాలకు కేజీవిల్ తగిలించుకొని ట్రాక్టర్ వెళ్తుండడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. అధికారులు అటు రైతులకు అవగాహన కల్పించడంతోపాటు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టకపోతే రోడ్లు గుంతలమయంగా మారుతాయి. చందుర్తి మండల కేంద్రంతో పాటు నర్సింగాపూర్, తిమ్మాపూర్, మల్యాల, ఎనగల్, మర్రిగడ్డ, సనుగుల, బండపల్లి జోగాపూర్ తదితర గ్రామాల్లో రైతులు భూములు సాగు చేస్తుంటారు. వరి పంట వేయాలంటే ముందుగా పొలాన్ని తడిపి దమ్ము చక్రాలతో దున్నాల్సి ఉంది. ఇందుకు ట్రాక్టర్లకు ఇనుప చక్రాలను అమర్చి రోజూ రైతులు తారు, సిమెంట్ రోడ్ల మీదుగా పొలాలకు వెళ్తుంటారు. దీంతో రోడ్లపై గీతలు పడడంతోపాటు గుంతలు ఏర్పడి ధ్వంసమవుతున్నాయి. ప్రధానంగా రైతులు ఇనుప చక్రాలకు రబ్బరు తొడుగులు అమర్చి నడిపితే రోడ్లు దెబ్బతినే అవకాశం ఉండదు. అవగాహన లేక రైతులు ట్రాక్టర్లు నడపడంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మిస్తున్న రోడ్లు మూన్నాళ్లకే ధ్వంసమవుతున్నాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసిన ఏడాదికే రోడ్లు మరమ్మతులకు గురవుతోంది. ట్రాక్టర్ల తాకిడికి ఇప్పటికే మూడపల్లి- హన్మాజీపేట, మూడపల్లి-నర్సింగాపూర్, ఎనగల్-బండపల్లి, జోగాపూర్-కిష్టంపేట్, సనుగుల-దేవునితాండ, చందుర్తి-మోత్కరావుపేట రోడ్లు అధ్వానంగా మారాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు దమ్ము చక్రాలకు రబ్బరు తొడుగులు వేసుకునేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రేషన్ డీలర్‌పై ఫిర్యాదు

కోనరావుపేట, జనవరి 28: కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామంలోని రేషన్ డీలర్ వంశీకృష్ణరావుపై అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జవ్వాజీ తిరుపతిగౌడ్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మర్తనపేట సర్పంచ్‌గా వంశీకృష్ణరావు కొనసాగుతూనే రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నాడన్నారు. ఇటు రేషన్ డీలర్ కమిషన్, అటు సర్పంచ్ గౌరవ వేతనం పొందుతూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నాడని అన్నారు. అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

‘ఎమ్మెల్యే అభివృద్ధిపై దృష్టి సారించాలి’

గన్నేరువరం, జనవరి 28: మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మండల అభివృద్ధిపై దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హితవు పలికారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కవ్వంపల్లి మాజీ ఎమ్మె ల్యే అయిన తనను, బీఆర్‌ఎస్ నాయకులను అవహేళన చేస్తూ మాట్లాడడం సరికాదని అన్నారు. మం డలాన్ని అభివృద్ధి చేయడంపై దృష్టి సారించి ప్రజల మన్నలను పొందాలని సూచించారు. సమావేశంలో జడ్పీటీసి మాడుగుల రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి బోనాలు



బోనాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 28: మండలంలోని రామలచ్చక్కపేట గ్రామం లోని మల్లికార్జున స్వామి బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రా మంలోని మల్లికార్జున స్వామిని భక్తులు ఉదయం నుంచి దర్శించుకున్నారు. భక్తులు భక్తి శ్రద్ధలతో బోనం తయారు చేసి నెత్తిన ఎత్తుకొని డప్పు చప్పుల మధ్య పోతు రాజుల విన్యాసాల నృత్యాలతో గ్రామ శివారులోని ఆలయానికి ఊరేగింపుగా బయలుదేరారు. ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న పాలక వర్గం



జోగులాంబ అమ్మవారి సన్నిధిలో పాలకవర్గ సభ్యులు

గంభీరావుపేట, జనవరి 28: గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు అలంపూర్ జోగులాంబ ఆలయంలో అమ్మవారి శక్తి పీఠాన్ని దర్శించుకున్నారు. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే సారధ్యంలో ఐదు సంవత్సరాల పదవీ కాలం పూర్తి అవుతున్న సందర్భంగా పలు ఆలయాలను పాలకవర్గ సభ్యులు దర్శించుకున్నారు. అనంతరం ముచ్చింతల సమతామూర్తి, యాదగిరి గుట్ట ఆలయాలను పాలకవర్గ సభ్యులు దర్శించుకున్నారు. యాత్రకు అన్ని ఏర్పాట్లతో పాటు ఆర్థిక సహాయాన్ని అందించిన సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులుకు ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ యాత్రకు వెళ్ళిన వారిలో వార్డు సభ్యులు రెడ్డిమల్ల రాజనర్సు పిట్ల శ్రీమతి, పాపగారి రాధాశ్రీనివాస్, పిట్ల బాబు, దోసల ప్రతిభావికాష్, రాచర్ల లతరాములు ఉన్నారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

భగత్‌నగర్, జనవరి 28: టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యులు జి తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర మహాసభల పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు, జి తిరుపతిరెడ్డి, డి భూపాల్‌రెడ్డి, రమణాచారి, పర్శరాములు, పోచయ్య, అర్కాల శ్రీనివాస్, శశిధర్, రాజయ్య, సంధ్యారాణి, బాలయ్య, వై తిరుపతి, రాంనారాయణ, స్వామి పాల్గొన్నారు.

అంజన్న సేవలో అథ్లెటిక్స్ కోచ్

మల్యాల, జనవరి 28: ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ఇండియన్ అథ్లెటిక్స్ కోచ్ నాగపూరి రమేష్ సతీసమేతంగా కొండగట్టు ఆంజనేయస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. వారి వెంట గౌతం రెడ్డి, మహిపాల్ ఉన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర

● వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు

కథలాపూర్, జనవరి 28: మండలంలోని తాండ్ర్యాలలో ఆదివారం మల్లికార్జునస్వామి జాతర ఘనంగా జరిగింది. గుట్టపై కొలువైన స్వామి వారి సన్నిధికి వందలాది మంది భక్తులు స్వామి దర్శనం కోసం బారులు తీరారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మల్లికార్జున స్వామితో మేడలాంబ, కేతలాంబ కళ్యాణం కమనీయంగా జరిగింది. కల్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. వేములవాడ ఎమ్మెల్యే కల్యాణంలో పాల్గొనగా అర్చకులు పూర్ణకుం భంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్థులు శాలువాతో సన్మానించారు.

కార్యక్రమంలో సర్పంచ్ గడీల గంగప్రసాద్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాం గ్రెస్ అధ్యక్షుడు అజీం, రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి పులి హరి ప్రసాద్, ఉరుమల్ల చారి, సత్యనారాయణ, గంగాధర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఎలాంటి సమస్యలున్నా నేరుగా ఫోన్ చేయండి

- ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్, జనవరి 28: ప్రజలు ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనకే ఫోన్ చేయాలని, సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జగిత్యాల మండలంలోని అంబా రిపేట, నర్సింగాపూర్, టీఆర్‌నగర్ గ్రామాల్లో ఎమ్మెల్సీ పర్యటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మౌళిక వసతుల కల్పనే ధ్యేయంగా గ్రామాలను అభివృద్ధి చేస్తానని హా మీ ఇచ్చారు. నర్సింగాపూర్ గ్రామంలో ఎస్సీ కాలనీల అభివృద్ధితో పాటుగా, ఇండ్ల నిర్మాణాల్లో ఎస్సీలకు ప్రాధాన్యతనిస్తామన్నారు. గ్రామాల్లోని మురికి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అంబారిపేట గ్రామంలో దేవాలయ అభివృద్ధికి కృషిచేస్తానని, ఆలయం వద్ద మూత్రశాలల నిర్మాణాలకు నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. టీఆర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ కొండా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు యువకులు, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఎమ్మెల్సీ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఐక్యతకు నిదర్శనం టీఆర్‌నగర్ అని అన్నారు. టీఆర్‌నగర్ అభివృద్ధికి నిధులు మం జూరు చేయిస్తానని, గ్రామ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఇంటింటికి తాగునీరు, అందిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరుగ్యారంటీలను అమలుచేస్తామని తెలిపారు. ఉగాది పండుగకు రేషన్‌కార్డులు జారీ చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధిగా జగిత్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీని కూల్చుతామని కొందరు వ్యక్తులు అంటున్నార ని, కాంగ్రెస్‌ను కూల్చడం ఎవరితరం కాదన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పా ర్టీ జగిత్యాల రూరల్ మండలశాఖ అధ్యక్షుడు జున్ను రాజేందర్, జగిత్యాల ప్యాక్స్ వైస్ చైర్మన్ శీలం సురేందర్, నాయకులు సిరాజ్, రాజిరెడ్డి, రవి, శ్రీనివాస్, తిరు పతి, నరేష్, సురేందర్ పాల్గొన్నారు

సంఘ భవనాలు ప్రారంభం

చొప్పదండి, జనవరి 28: మండలంలోని దేశాయిపేట గ్రామంలో ఆదివారం మహిళ సంఘం, గొల్లకుర్మ సంఘం, గౌడ సంఘం, అంబేద్కర్ సంఘ భవనాలతో పాటు వైకుంఠధామాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుంట రవి, ఎంపీటీసీ కూకట్ల తిరుపతి, జిల్లా కాంగ్రెస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతి, నాయకులు రంగన్న, కొట్టె అశోక్, మునిగాల సుధాకర్‌గౌడ్, పెరుమాండ్ల రవీందర్, జక్కన్న, మోహన్‌గౌడ్, శేఖర్‌గౌడ్, ఎల్లాల ఆదిరెడ్డి పాల్గొన్నారు.

గంగాధర: తెలంగాణ ప్రజల సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం గంగాధర మండలం మల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు, నారాయణపూర్‌లో గౌడ సంఘ, కురుమ సంఘ,మహిళా సంఘ భవనాలను ప్రారంభించి, రంగరావుపల్లిలో రెడ్డి సంఘ భవనానికి భూమి పూజ, వైకుంఠధామాన్ని ఆయన ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన గంగాదర వ్యవసాయ సొసైటీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మండలంలోని పలుగ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.